# భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)
# కేంద్ర కమిటీ

**పత్రికా ప్రకటన**

**జూలై 12, 2011**

## ప్రజల కోసం ప్రాణాలర్పించిన అమరవీరుల త్యాగాలను ఎత్తిపట్టండి!

### అమరవీరుల త్యాగాల ప్రేరణతో ప్రజాయుద్ధాన్ని తీవ్రతరం చేయండి! ఆపరేషన్ గ్రీన్‌హంట్‌ను ఓడించండి!!

**జూలై 28 నుండి ఆగస్టు 3 వరకు అమరవీరుల సంస్మరణ వారం విజయవంతం చేయండి!**

ప్రజా విముక్తి కోసం అత్యంత విలువైన ప్రాణాలను సైతం ధారపోసిన త్యాగధనులు మొత్తం మానవ సమాజానికే ఆదర్శం. ఈ వీరుల త్యాగాల ఫలితంగానే పీడిత ప్రజలు అనేక విజయాలు సాధిస్తున్నారు. సోషలిజం-కమ్యూనిజం లక్ష్యసాధనలో భాగంగా, భారతదేశంలో నూతన ప్రజాస్వామిక విప్లవ విజయానికై పోరాడుతూ గత సంవత్సర కాలంలో 260 మందికి పైగా పార్టీ నాయకులు, కార్యకర్తలు, పిఎల్‌జిఏ యోధులు, ప్రజా సంఘాలు, ప్రజా మిలీషియా సభ్యులు, సాధారణ ప్రజానీకం తమ విలువైన ప్రాణాలను ప్రజల కోసం ధారపోశారు. ఇందులో దండకారణ్యంలో 77 మంది, బీహార్-ఝార్ఖండ్-ఉత్తర ఛత్తీస్‌గఢ్‌లో 78 మంది, ఒడిషాలో 29 మంది, ఆంధ్ర-ఒడిషా సరిహద్దు ప్రాంతంలో 16 మంది, పశ్చిమ బెంగాల్‌లో ఏడుగురు, లాల్‌గఢ్ ప్రజా ఆందోళనలో 36 మంది, ఛత్తీస్‌గఢ్-ఒడిషా సరిహద్దులో 10 మంది, మహారాష్ట్రలో ముగ్గురు కామ్రేడ్స్, ఉత్తర తెలంగాణలో ఒక కామ్రేడ్ ఉన్నారు. వీరిలో 30 మందికి పైగా మహిళా కామ్రేడ్స్ ఉన్నారు. దోపిడీవర్గాలు 'ప్రజలపై సాగిస్తున్న యుద్ధాన్ని' ఓడించడం కోసం, మొగ్గతొడుగుతున్న నూతన ప్రజా రాజ్యాధికారాన్ని మరింతగా ఎదిగించడం కోసం శత్రు బలగాలతో సాహసికంగా పోరాడుతూ ప్రజాయుద్ధాన్ని పురోగమింపజేసే క్రమంలో వీరంతా అసువులు బాసారు. భారత విప్లవ మహోపాధ్యాయులు కామ్రేడ్స్ చారు మజుందార్, కన్నాయ్ చటర్జీలు సహా భారత నూతన ప్రజాస్వామిక విప్లవోద్యమంలో ప్రాణాలర్పించిన అమరవీరులందరి స్మృతిలో జులై 28 నుంచి అమరవీరుల సంస్మరణ వారాన్ని ప్రతి యేడాది లాగానే ఘనంగా జరపాలని పార్టీకి, పిఎల్‌జిఏకూ, విప్లవ ప్రజా ప్రభుత్వాలకు, విప్లవ ప్రజా సంఘాలకు, ప్రజలకు భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) కేంద్రకమిటీ పిలుపు నిస్తున్నది.

దేశంలోనే కాకుండా వివిధ దేశాలకు చెందిన ప్రజలు, ప్రజాస్వామికవాదులు, దేశభక్తులు, రచయితలు, కవులు, కళాకారులు 'ప్రజలపై యుద్ధాన్ని' (ఆపరేషన్ గ్రీన్‌హంట్) ముక్తకంఠంతో వ్యతిరేకిస్తున్నా, దోపిడీ పాలకవర్గాలు ఏమాత్రం లక్ష్యపెట్టకుండా ఆపరేషన్ 'గ్రీన్ హంట్' రెండో దశను ప్రారంభించి తమ కిరాయి పోలీసు, పారామిలిటరీ బలగాలతో, విప్లవ ప్రతీఘాతుక ముఠాలతో విచ్చలవిడి హత్యాకాండల్ని కొనసాగించాయి. వీటిలో అత్యధికంగా సాధారణ ప్రజానీకమే ప్రాణాలు కోల్పోయారు. వీరిలో లాల్‌గఢ్ ప్రజా తిరుగుబాటులో భాగస్వాములైన ఆదివాసీ ప్రజలు, ఒడిషాలో విస్థాపన వ్యతిరేక ఉద్యమంలో ముందు పీఠిన నిలిచిన ఆందోళనకారులు, దండకారణ్యం, బీహార్, ఝార్ఖండ్, ఉత్తర ఛత్తీస్‌గఢ్‌లలోని విప్లవ సానుభూతిపరులు, ప్రజలు ఉన్నారు. వీరందరినీ 'మావోయిస్టులు' అనే పేరుతో పోలీసు, పారామిలటరీ బలగాలు, పశ్చిమబెంగాల్‌లో హర్మద్ వాహిని, గణ ప్రతిరోధ్ కమిటీ గూండాలు, దండకారణ్యంలో కోయ కమాండోలు, ఎస్‌పిఓలు, సల్వాజుడుం గూండాలు హత్య చేశారు. పశ్చిమ బెంగాల్‌లో లాల్‌గఢ్ ప్రాంతం, నేతాయి గ్రామంలో సోషల్ ఫాసిస్టు సిపిఎం గూండాలు నలుగురు మహిళలతో సహా 9 మందిని సామూహికంగా హత్య చేసిన దారుణ సంఘటనకు వ్యతిరేకంగా ఆ రాష్ట్రంలో పెద్దయెత్తున ఆందోళన సాగింది. ఇలాగే దండకారణ్యంలో చింతల్‌నార్ ప్రాంతంలో కోబ్రాలు, కోయ కమాండోలు, సల్వాజుడుం గూండాలు ఆరు రోజుల పాటు సాగించిన తెల్ల బీభత్సాన్ని దేశవ్యాపితంగా ప్రజాస్వామికవాదులు నిరసించారు. ఉత్తర ఛత్తీస్‌గఢ్‌లో మీనా ఖాల్ఖో అనే పదహారేళ్ల ఆదివాసీ బాలికపై సామూహిక అత్యాచారం జరిపి బూటకపు ఎన్‌కౌంటర్‌లో హతమార్చిన పోలీసు దుశ్చర్యను ప్రజలు తీవ్రంగా ఖండించారు. ఇవన్నీ 2010 ఆగస్టు నుంచి 2011 జూన్ మధ్య జరిగిన ఘటనలే.

వీటితో పాటు బూటకపు ఎన్‌కౌంటర్లు, పిఎల్‌జిఏ బలగాలపై విషప్రయోగాలు, ప్రజలపై, ప్రజా మిలీషియాపై శత్రు బలగాలు జరిపిన ఆంబుష్‌లు, ఎన్‌సర్కిల్‌మెంట్ దాడులు వగైరా మూలంగా ఎందరో ప్రజలు, విప్లవకారులు ప్రాణాలు కోల్పోయారు, ఛత్తీస్‌గఢ్-ఒడిషా సరిహద్దున మహాసముంద్ జిల్లాలో పడ్కిపాలి దగ్గర విప్లవోద్యమ విస్తరణ కర్తవ్యంతో ప్రజల్లో పని చేస్తున్న పీఎల్‌జీఏ కంపెనీపై శత్రువు చేసిన ఆంబుష్‌లో ఆరుగురు కామ్రేడ్స్ అమరులయ్యారు. ఈ సందర్భంగా ఇద్దరు గ్రామస్తుల్ని కూడా పట్టుకొని కిరాయి పోలీసు బలగాలు క్రూరంగా హత్య గావించాయి. శత్రు బలగాలతో జరిగిన నిజమైన ఎన్‌కౌంటర్లలో కొద్దిమంది కామ్రేడ్స్ అమరులయ్యారు. కొంతమంది కామ్రేడ్స్‌ను, ప్రజలను పోలీసులు మాయం చేశారు. కొన్ని ఇతర సంఘటనలలో, దుర్ఘటనలలో, అనారోగ్యాలతో మరి కొద్దిమంది కామ్రేడ్స్ అమరులయ్యారు.

అమరులైన నాయకత్వ కామ్రేడ్స్‌లో పశ్చిమబెంగాల్‌లో లాల్‌గఢ్ ప్రజా నాయకులు కామ్రేడ్స్ ఉమాకాంత్ మహతో, శశధర్ మహతో, పార్టీ రీజనల్ కమిటీ సభ్యుడు కామ్రేడ్ అరుణ్, కామ్రేడ్ ఖోఖన్ మహతో; బీహార్‌లో ప్లాటూన్ కమాండర్ కామ్రేడ్ విక్రమ్ ముండా, బాంకా జిల్లా కటోరియా పోలీస్‌స్టేషన్ పరిధిలో మంజరి ఎన్‌కౌంటర్‌లో అమరులైన ఆరుగురిలో ఒక నాయకత్వ కామ్రేడ్; ఒడిషాలో ప్రఫుల్ నాయక్, లక్ష్మణ్ ముండా, గాగ్రీ కడేస్కీ; బీహార్-ఝార్ఖండ్‌లో కంపెనీ కమాండర్ కామ్రేడ్ నితాంత్, ఒడిషాలో కాశీపూర్ చుట్టివేత దాడిలో బాసధార డివిజన్ కమిటీ సభ్యుడు కామ్రేడ్ రవి, దండకారణ్యంలో ఉత్తర బస్తర్ డివిజనల్ కమాండర్-ఇన్-చీఫ్ కామ్రేడ్ నాగేష్, మహారాష్ట్రలో గోందియా డివిజనల్ కమాండర్-ఇన్-చీఫ్ కామ్రేడ్ నాగేష్, ఛత్తీస్‌గఢ్‌లోని మహాసముంద్ జిల్లాలో ప్లాటూన్ కమాండర్ కామ్రేడ్ కోసా (అయితు), సాంస్కృతిక కార్యకర్త కామ్రేడ్ నతాష, దండకారణ్యంలో ప్లాటూన్-7 కమాండర్ కామ్రేడ్ మహరూ, ప్రజా టీచర్ కామ్రేడ్ చందన, ప్రెస్ కార్యకర్త కామ్రేడ్ చైతె మొదలైనవారు వున్నారు.

పిఎల్‌జిఏ బలగాలు శత్రు సాయుధ బలగాలపై చేసిన దాడుల్లో బీహార్‌లో లఖీసరాయ్-కజరా ఆంబుష్‌లో (2010 ఆగస్టు 29) సెక్షన్ కమాండర్

కామ్రేడ్ రతన్ యాదవ్, దండకారణ్యంలో ఊసూర్ ఆంబుష్‌లో (2010 సెప్టెంబర్ 21) ఇద్దరు మిలిషియా కామ్రేడ్స్ ఓయం బుద్రు, వెట్టి హిడ్మాల్‌లు, తిమ్మాపురం ఆంబుష్‌లో (2011 మార్చ్ 14) సెక్షన్ డిప్యూటీ కామ్రేడ్ ముచాకి గంగా, బెజ్జి ఆంబుష్‌లో (2011 జూన్ 11) పిఎల్‌జిఏ బెటాలియన్‌కు చెందిన పిపిసిఎం కామ్రేడ్ మంగ్డూ, మహారాష్ట్రలో కోబ్రామెండ (గోందియా డివిజన్) ఆంబుష్‌లో (2011 ఏప్రిల్ 19) ముగ్గురు కామ్రేడ్స్ - గోందియా డివిజనల్ కమాండర్-ఇన్-చీఫ్ కామ్రేడ్ నాగేష్, పిఎల్‌జిఏ సభ్యులు కామ్రేడ్స్ మంజు, మంగు, నార్గొండ (గడ్చిరోలి డివిజన్)లో (2011 మే 19) ప్రజా శత్రువు, పరమ కర్కోటకుడు అయిన చిన్నా వెంటన్ని ఖతం చేసిన వీరోచిత చర్యలో ఇద్దరు కామ్రేడ్స్ - ప్లాటూన్-7 కమాండర్ మహరు, ఏరియా కమిటీ సభ్యుడు రాకేష్‌లు నేలకొరిగారు. కొయిలీబేడ సమీపంలో జరిగిన సులంగీ ఆంబుష్‌లో (2011 జూన్ 26) కంపెనీ-1కు చెందిన ఇద్దరు పీఎల్‌జీఏ సభ్యులు కామ్రేడ్స్ జోగాల్, శ్యాంలాల్‌లు అమరుడయ్యారు.

అలాగే అనేక దశాబ్దాలుగా ప్రజాస్వామిక హక్కుల కోసం ప్రజల పక్షాన నిలిచి పోరాడిన విప్లవ మేధావులు, పౌరహక్కుల ఉద్యమ నాయకులు కామ్రేడ్స్ కన్నబీరన్, పత్తిపాటి వెంకటేశ్వర్లు, ప్రొఫెసర్ ఆర్. సోమేశ్వరరావు తదితరులు ఈ సంవత్సర కాలంలో తుదిశ్వాస విడిచారు. వీరి మరణంతో భారత విప్లవం తన ప్రగాఢ మిత్రుల్ని, శ్రేయోభిలాషులను కోల్పోయింది.

అమరవీరుల సంస్మరణ వారాన్ని పురస్కరించుకొని పార్టీ సంస్థాపక నేతలు కామ్రేడ్స్ చారు మజుందార్, కన్హాయ్ చటర్జీలనూ, నక్సల్బరీ నుండి నేటి వరకూ అమరులైన వేలాది మంది జ్ఞాత, అజ్ఞాత అమరులందరికీ కేంద్రకమిటీ తలవంచి నివాళులర్పిస్తున్నది. వారి ఆశయ సాధనకు అవిశ్రాంతంగా పోరాడ శపథం చేస్తున్నది. ఈ సందర్భంగా అమరుల బంధు మిత్రులందరికీ, సహచరులందరికీ ప్రగాఢ సంతాపాన్ని తెలుపుతూ వారి సంవేదనలో పాలుపంచుకుంటున్నది. అమరులులేని లోటును పూడ్చాలని వారి ప్రియ సహచరులందరినీ కోరుతున్నది.

ఈ సంవత్సరం అరబ్బు ప్రపంచం తిరుగుబాట్లతో దద్దరిల్లుతోంది. లక్షలాది మంది అరబ్బు ప్రజలు నిరంకుశత్వానికీ, అవినీతికీ, నిరుద్యోగానికీ వ్యతిరేకంగా, ప్రజాస్వామ్యం కోసం అమెరికా సామ్రాజ్యవాదుల తొత్తు పాలకవర్గాలకు వ్యతిరేకంగా మిలిటెంట్‌గా పోరాడుతున్నారు. ఈ ప్రజా తిరుగుబాట్లలో వేలాది మంది ప్రజలు, ప్రజా నాయకులు నేలకొరిగారు. వివిధ దేశాలలో ప్రజాస్వామ్యం కోసం, జాతి విముక్తి కోసం, వర్గ దోపిడీ పీడనల నుండి విముక్తి కోసం సామ్రాజ్యవాదానికి, అన్ని రకాల ప్రతీఘాతుకత్వానికి వ్యతిరేకంగా పోరాడే క్రమంలో నేలకొరిగిన వీరయోధులందరికీ అమరవీరుల సంస్మరణవారం సందర్భంగా సీపీఐ (మావోయిస్టు) శ్రద్ధాంజలి ఘటిస్తోంది.

ఆపరేషన్ గ్రీన్‌హంట్‌ను ఓడించేందుకు చేపట్టిన ఎత్తుగడల ఎదురుదాడులు ఈ కాలంలో చిన్న, మధ్యస్థాయిలో ఎన్నో జరిగాయి. ఈ దాడులు శత్రు దూకుడుతనానికి కళ్లెం వేశాయి. ప్రత్యేకించి, శత్రువు దండకారణ్యంలోని నారాయణపూర్ జిల్లాలో సైన్యాన్ని మోహరించే ప్రక్రియ వేగిరపరుస్తున్న తరుణంలో ఈ దాడులు జరగడం దోపిడీ పాలకవర్గాలను, వాళ్ల సాయుధ బలగాలను తీవ్రంగా కలవరపరిచాయి. అలాగే ఝార్ఖండ్‌లో వేలాది శత్రు బలగాలు సైన్యం తరహాలో జరిపిన దాడుల్ని పిఎల్‌జిఏ బలగాలు అత్యంత వీరోచితంగా తిప్పికొట్టాయి.

మరోవైపు లాల్‌గఢ్, నారాయణపట్నా ప్రజా ఉద్యమాలు తీవ్ర నిర్బంధంలో సైతం శత్రువుకు తలవంచకుండా పురోగమిస్తున్నాయి. దేశంలోని అనేక ప్రాంతాల్లో విస్థాపన వ్యతిరేక పోరాటాలు సాగుతున్నాయి. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం ఆందోళన తీవ్రతరమవుతోంది. సామ్రాజ్యవాదుల, వారి తొత్తు దోపిడి పాలకవర్గాల ధనికవర్గ-కార్పొరేట్ 'అభివృద్ధి నమూనా'ను వ్యతిరేకిస్తూ ప్రజలు ఎక్కడికక్కడ ఆందోళనలకు దిగుతున్నారు. ఇలాంటి పోరాటాలకూ మావోయిస్టులకూ వున్న లింకును పసిగట్టే పనిలో ఇంటెలిజెన్స్ జాగిలాలు వాటి చుట్టూ తిరుగుతూ, వాటికి మావోయిస్టు రంగును పులిమేందుకు ప్రయత్నిస్తున్నాయంటే మావోయిస్టు వుద్యమమంటే దోపిడీ పాలకవర్గాలు ఎంతగా కలవరపడుతున్నాయో అర్థమవుతుంది. మరోవైపు మావోయిస్టు ప్రజాయుద్ధం దేశంలోని ప్రజాస్వామికవాదులను, ప్రగతిశీల శక్తులను ఎంతగానో ఉత్సాహపరుస్తోంది. అమరవీరుల త్యాగాలే వీరికి ప్రేరణనందిస్తున్నాయి.

**ప్రియమైన ప్రజలారా!** మావోయిస్టు ఉద్యమాన్ని సమూలంగా నిర్మూలిస్తామని విర్రవీగుతూ సోనియా-మన్మోహన్‌సింగ్-చిదంబరం-ప్రణబ్ ముఖర్జీల పాలక ముఠా ఆపరేషన్ గ్రీన్‌హంట్ పేరుతో ప్రజలపై ఒక అన్యాయమైన యుద్ధాన్ని కొనసాగిస్తున్నది. ప్రస్తుతం దీని రెండో దశలో భాగంగా దండకారణ్యంలోని బస్తర్ ప్రాంతంలో సైన్యాన్ని మోహరించింది. మరోవైపు ఇది మోహరింపు కాదనీ, ట్రెయినింగ్ కోసమే సైన్యం వస్తున్నదని చెబుతూ ప్రజలను మోసగించాలని చూస్తున్నది. విప్లవోద్యమాన్ని పరిమిత ప్రాంతాలకు కుదించివేసి చుట్టివేసి నిర్మూలించాలనే వ్యూహంలో భాగంగా విప్లవోద్యమాన్ని విస్తరించకుండా అడ్డుకోవడం కోసం భారీ ఎత్తున అణిచివేత క్యాంపెయిన్లు కొనసాగిస్తున్నారు. ఇన్‌ఫార్మర్ నెట్‌వర్క్‌ను బలంగా ఏర్పర్చుకుంటున్నారు. అయినప్పటికీ ప్రజా గెరిల్లా బలగాలు శత్రువుతో బాహాబాహీ పోరాడుతూ విప్లవోద్యమాన్ని నూతన ప్రాంతాలకు విస్తరింపజేస్తున్నాయి. గెరిల్లా జోన్లలో వికసిస్తున్న నూతన ప్రజా రాజ్యాధికారాన్ని కాపాడుతున్నాయి. శత్రు బీభత్సకాండల నుండి ప్రజల ప్రాణాలను, పంటలను, ఆస్తులను కాపాడుతున్నాయి. ఈ కృషి అంతటిలో అమరవీరుల త్యాగాలు నిక్షిప్తమై వున్నాయి. రేపు సాధించబోయే మహోన్నత విజయాలకు అవి హామీగా వున్నాయి.

గొప్ప త్యాగాలు లేకుండా ప్రపంచంలో ఏ విప్లవమూ విజయం సాధించలేదు. నేడు విప్లవం మనల్ని మరిన్ని త్యాగాలకు సిద్ధం కమ్మంటోంది. పోరాడ సాహసిస్తే ప్రజలు అజేయులు. అత్యద్భుతంగా ఉన్న విప్లవ పరిస్థితులను సమర్థవంతంగా ఉపయోగించుకుంటూ, అమరుల రక్తంతో ఎరుపెక్కిన జెండాను చేబూని ప్రజాయుద్ధ బాటలో దృఢంగా పురోగమిద్దాం! మన దేశాన్ని భూస్వామ్య, దళారీ నిరంకుశ పెట్టుబడిదారీ, సామ్రాజ్యవాద దోపిడీపీడనల నుండి విముక్తం చేసి అణచివేతకు, అన్యాయానికి తావులేని నూతన ప్రజాస్వామిక భారతాన్ని నిర్మిద్దాం, రండి!

Abhay

**(అభయ్)**

**అధికార ప్రతినిధి**

**కేంద్ర కమిటీ**

**సీపీఐ (మావోయిస్టు)**